క్లుప్తంగా...

నేడు ఎంజీఐటీలో ఫ్లాగ్ రన్

మణికొండ: గండిపేటలోని ఎంజీఐటీ కళాశాలలో శనివారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు 'ది సోషల్ క్లబ్' ఆధ్వర్యంలో ఫ్లాగ్‌రన్‌ను నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ చంద్ర మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ అభివృద్ధి, వాతావరణ మార్పుల శాఖ ప్రతినిధి అశ్విన్‌కుమార్ చూబే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు.

రేపు జాబ్‌మేళా

శంషాబాద్: నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 8న ఆదివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరీ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో జరిగే మెగా జాబ్ మేళాకు ఔత్సాహికులైన అభ్యర్థులు హాజరుకావాలని ఆమె కోరారు.

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



క్రీడా సామగ్రిని పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, కౌన్సిలర్ లక్ష్మి

శంషాబాద్: క్రీడలు యువత జీవితాన్ని ఉజ్వలంగా మారుస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను శుక్రవారం కొత్వాల్‌గూడలో స్థానిక కౌన్సిలర్ లక్ష్మీ శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువత క్రీడలపై ఆసక్తి కనబరచాలన్నారు. క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. బీఆర్ ఎస్ నేత శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు

బీజేపీ నేతలను విమర్శించడం సరికాదు

శంషాబాద్: బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైతి శ్రీధర్ గ్రామాల్లో పర్యటిస్తూ.. ప్రజాసమస్యలపై గళమెత్తుతుంటే కొందరు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు సరైన పద్ధతి కాదని బీజేపీ నాయకులు, పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు కొత్త పోచయ్య అన్నారు. పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు బీఆర్ఎస్ నేతలకు కాకుండా నిజమైన లబ్ధిదారులకు ఒక్కరికైనా అందాయా.. లేదా అని ప్రశ్నించుకోవాలన్నారు. అడ్డగోలుగా మాట్లాడితే సహించేది లేదని, తప్పులు చేసినప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

ఉమ్రాకు బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలకు చెందిన యాత్రికులు శుక్రవారం ఉమ్రా యాత్రకు బయలుదేరారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరిన యాత్రికులకు వారి కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్రా యాత్రను అల్‌మిజాన్ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షిస్తున్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం



అత్తాపూర్: గత కొద్ది రోజులుగా ఆశావర్కర్లు ఆందోళన చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు వాపోయారు. శుక్రవారం ఆశా వర్కర్లు హైదర్‌గూడ నుంచి అత్తాపూర్ చౌరస్తా వరకు సీఎం దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు కనీస వేతనంగా రూ.18 వేలు చెల్లించాలని, తమకు కనీస సౌకర్యాలైన ఇన్సూరెన్స్, పీఆర్సీ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రుద్రవర్మ, స్వామి, సారా బేగం, సబిత, జయశ్రీ, జయలక్ష్మి, వీరమణి, సువర్ణ తదితరులున్నారు.

9న ఉపాధ్యాయ విద్యపై సమావేశం

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఈ అండ్ టీ) ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ విద్యలో కొత్త విధానాలు, అవకాశాలు, సవాళ్ళు' అనే అంశంపై ఒకరోజు సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రొఫెసర్ వనజ తెలిపారు. 'మనూ' క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈనెల 9న ఉదయం 10.30 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. ఐటీఈపీని కూడా ప్రారంభించనున్నామని, మధ్యాహ్నం 3 గంటలకు జరిగే చర్చలో ప్యానలిస్టులుగా ప్రొఫెసర్ ఘంటా రమేష్, ప్రొ. శ్రీనివాసరావు, ప్రొ.జేవి మధుసూదన్, డా.శంకర్ పాల్గొంటారన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



పీఏసీఎస్ వ్యవసాయ గోదామ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పనిచేస్తోందని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన గోదామును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతు బీమాతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను భద్రపర్చుకోవడానికి పదుల సంఖ్యలో గోదాములు నిర్మాణం చేసి అప్పగిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, హెచ్‌డీసీబీ సీఈఓ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ముద్దం మల్లారెడ్డి, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు జ్ఞానేశ్వర్, డైరక్టర్లు కరుణాకర్‌రెడ్డి, నంద కిశోర్, సులోచన, సురేందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, పోచయ్య, శ్రీనివాస్, సత్తిరెడ్డి, అరుంధతి, కార్యదర్శి అర్జున్ తదితరులున్నారు.

భవిష్యత్ తరాలను బలంగా ఉంచాలి



విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్‌ను అందిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్లు

మణికొండ: విద్యార్థులకు సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, కమిషనర్ బి.సురేందర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని వారు గండిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నందునే వారు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారన్నారు. అలాంటి వారు ఇంట్లోను మంచి పోషక విలువల ఆహారం తీసుకోవటం కష్టమేనని అభిప్రాయపడ్డారు. అలాంటి బాల, బాలికలకు మంచి పోషక విలువల ఆహారాన్ని టిఫిన్‌ల రూపంలో అందించడం మంచి పరిణామన్నారు. పేద విద్యార్థులకు ఇలాంటి పథకాన్ని అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల విద్యాధికారి రాంరెడ్డి, నోడల్ అధికారి విజయ్‌కుమార్, కౌన్సిలర్లు గోపాల సునీత, విజిత, పత్తి శ్రీకాంత్‌రావు, కో– ఆప్షన్ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్, డీఈ నరసింహారాజు, ప్రధానోపాధ్యాయురాలు మనోరమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ పురుషోత్తం

మణికొండ: కాలనీలలో కమ్యూనిటీహాళ్ల నిర్మాణం అవసరమని, వాటికి పెద్దపీట వేసి అన్ని కాలనీల్లో వాటిని నిర్మిస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ 18వ వార్డు కౌన్సిలర్ డి.పురుషోత్తం అన్నారు. శుక్రవారం ఆయన తన వార్డు పరిధిలోని సంతోష్‌నగర్ కాలనీలో రూ. 49 లక్షలతో బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో స్థలాలు ఉన్న అనేక కాలనీలలో కమ్యూనిటీహాళ్లను ఇప్పటికే నిర్మించేందుకు పాలక కమిటీ కృషి చేసిందన్నారు. ప్రజలకు కమ్యూనిటీహాళ్లు లేకపోవటంతో సామూహిక కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తప్పిపోయి.. తిరిగి తల్లిదండ్రుల చెంతకు..



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న మున్సిపల్ కమిషనర్, మేనేజర్లు

మణికొండ: ఇంటి నుంచి బయటకు వచ్చిన ఓ బాలుడు తిరిగి ఇంటికి వెళ్లేందుకు దారి తెలియక ఏడుస్తూ.. రోడ్డు పక్కన కనిపించిన బాలున్ని మున్సిపల్ సిబ్బంది, అధికారులు తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని గోల్డెన్ టెంపుల్ వద్ద సూర్యాన్ష్ అనే బాలుడు ఏడుస్తూ కనిపించగా.. అటుగా వెళ్తున్న మున్సిపల్ సిబ్బంది జయసింహా బాలుడిని వివరాలు అడిగినా చెప్పలేకపోవటంతో మున్సిపల్ కార్యాలయానికి తీసుకుని వచ్చారు. బాలుడిని వెతుకుతున్న వారిని గుర్తించేందుకు కాలనీలో తిరిగి వారి తండ్రిని గుర్తించారు. అతన్ని మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్, మేనేజర్ రమేష్‌ల ఆధ్వర్యంలో బాలుడిని తండ్రికి అప్పగించారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు చేసిన పనిని ప్రతి ఒక్కరూ మెచ్చుకున్నారు.

కార్మికుల సమస్యలు పట్టించుకోరా !



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజనం కార్మికులు

శంషాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి కనీస చర్యలు తీసుకోకుండా మరో వైపు అల్పాహారం పథకం ప్రారంభించడం విచిత్రంగా ఉందని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేష్ విమర్శించారు. 12 రోజులుగా కార్మికులు ధర్నా చేస్తున్నా.. ప్రభుత్వం కనీసం మానత్వం కూడా చూపడం లేదన్నారు. రోజుకు కేవలం రూ. 33 కార్మికుల జీవితాలను ఎలా నెట్టుకొస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం..

మరో వైపు ఆశావర్కర్లు సమ్మెలో భాగంగా శుక్రవారం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరోనా కష్టకాలంలో పనిచేసిన ఆశావర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ



శివరాంపల్లి మాదురి ప్రభాకర్‌రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనమైన బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య వైభవంగా నిర్వహించుకోవాలని శివరాంపల్లి గ్రామ శాఖ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మాదురి ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం శివరాంపల్లి నేతాజీ యూత్ క్లబ్ ఆవరణలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఆడపడుచులు అందరూ సంబరంగా నిర్వహించుకునే ఈ వేడుక ప్రకృతిని ఆరాధిస్తూ.. సాంస్కృతిక వారసత్వాన్ని చాటి చెబుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డల సంతోషమే ధ్యేయంగా అద్భుతమైన పథకాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. లక్ష్మీనారాయణ, రాజు, ప్రభాకర్, సల్మాన్, కన్యాకుమారి, మంజుల, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

ఈనెల 10 నుంచి బీజేపీ అసెంబ్లీ టూర్

శంషాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయ ఢంకా మోగించేందుకు ఆ పార్టీ కార్యచరణ సిద్ధం చేసింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కాషాయదళాన్ని చైతన్య పరిచేందుకు అసెంబ్లీ టూర్ కార్యక్రమానికి సన్నద్ధమైంది. ఈ మేరకు ఈనెల 10న అసెంబ్లీ టూర్‌ను నియోజకవర్గం నుంచి ప్రారంభించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా శంషాబాద్‌లోని జైత్రి గార్డెన్ ఆవరణలో పార్టీ శ్రేణులు, ప్రజలకు దిశానిర్దేశం చేసేందుకు బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో పాటు పార్టీ కీలక నేతలు బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించారు.

అదే రోజు కేటీఆర్ బహిరంగ సభ..

పట్టణంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ జరిగే రోజే మంత్రి కేటీఆర్ బహిరంగ సభ కార్యక్రమానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శంషాబాద్ పట్టణంలో హెచ్ఎండీఏ నుంచి విడుదలైన రూ. 50 కోట్ల పనుల ప్రారంభం అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లేందుకు బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాల మైదానంలో ఈ మేరకు ఏర్పాట్లను బీఆర్ ఎస్ పట్టణ అధ్యక్షుడు దూడల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కేటీఆర్ బహిరంగ సభ మధ్యాహ్నం షెడ్యూల్ కాగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా బహిరంగ సభ సాయంత్రం 6 గంటలకు నిర్ధారించినట్లు సమాచారం.

కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



సమ్మె నోటీస్ అందజేస్తున్న యూనియన్ సభ్యులు

బండ్లగూడ: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. గండిపేట్ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వేతనాల పెంపు, ఉద్యోగభద్రత, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్మికులకు రూ.21 వేల వేతనాన్ని చెల్లిస్తున్నారన్నారు. ధనిక రాష్ట్రంగా గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని ఉద్యోగ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. పారిశ్రామిక విధానాల చట్టం 1947 సెక్షన్ 22 ప్రకారం సమ్మె నోటీస్ ఇస్తున్నామన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో అక్టోబర్ 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. యాదగిరి, సురేష్, వెంకటేష్, సుభాష్, నరేందర్, మల్లేష్, కృష్ణ, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు తదితరులున్నారు.

9న 'మనూ' ఐటీఐలో అడ్మిషన్ కౌన్సిలింగ్

రాయదుర్గం: మనూ ఐటీఐలో ఈనెల 9వ తేదీన అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజమ్ తెలిపారు. 'మనూ' ఐటీఐలోని వివిధ ట్రేడ్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులను సమర్పణకు అక్టోబర్ 8 చివరి తేదీ అని పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 9.30కు అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులు కావాల్సిన వారు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.manuu.edu.in నుంచి పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. వివరాలకు ఐటీఐ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా ఫోన్ ద్వారా 040–23008428, సెల్‌ఫోన్ 9440692452లో సంప్రదించవచ్చన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీస్



నార్సింగి మున్సిపల్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేత

మణికొండ: ధనిక రాష్ట్రమని చెప్పు కుంటున్నా.. వాటి ఫలితాలు కార్మికులకు అందటం లేదని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇస్తున్న మాదిరిగా కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలని, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు సమ్మెబాట పడుతున్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ అధికారులకు సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల సంక్షేమానికి కృషిచేసే మున్సిపల్ కార్మికులకు వేతనాలను పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తుందని మండిపడ్డారు. మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవటం లేదన్నారు. ఈనెల 8 నుంచి కార్మికులు సమ్మె చేస్తారని ప్రకటించారు. మున్సిపల్ కార్మిక అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, నాయకులు సయ్యద్, మహమ్మద్, రవి, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాహుల్, సుధీర్, కుమార్, అనిల్, మహేష్, సన్నీ, అరుణ్, జ్యోతి తదితరులున్నారు.

నిధుల విడుదలలో జాప్యం వద్దు



శంషాబాద్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీలకు ప్రతినెలా ప్రభుత్వం నుంచి జనాభా ప్రాతిపదికన వచ్చే నిధులను వెంటనే విడుదల చేయాలని పెద్ద షాపూర్ ఎంపీటీసీ సభ్యుడు చెక్కల ఎల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి గత 11 నెలలుగా నిధులు రాక పంచాయతీలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెద్దషాపూర్ పంచాయతీకి ఇప్పటి వరకు రూ.31 లక్షలు రావాల్సి ఉందని, పంచాయతీకి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం పూర్తిగా కరెంటు బిల్లులకే సరిపోతుందన్నారు. సిబ్బంది జీతాలు కూడా చెల్లింపు కాకుండా పంచాయతీ ఖాతాలను రెండు నెలల నుంచి ఫ్రీజ్ చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సైతం విడుదల చేయడంలేదన్నారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన క్రీడాప్రాంగణం పనులు పూర్తిచేసి రెండేళ్లు గడుస్తున్నా.. బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. బకాయిలను వెంటనే చెల్లించి పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని కోరారు.

సీబీఐటీలో ఐఈఈఈ ఎడ్యుకేషన్ శాఖ



మణికొండ: సీబీఐటీలో ఐఈఈఈ ఎడ్యుకేషన్ సొసైటీ విద్యార్థుల శాఖను ప్రారంభించారు. శుక్రవారం ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సొసైటీ చైర్‌పర్సన్ దివ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్టూడెంట్ బ్రాంచ్‌ను స్థాపించడం వలన విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్ సభ్యులతో అనేక అంశాలపై చర్చించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంపొందించుకోవటంతో పాటు నాయకత్వాన్ని పెంచుకోవచ్చన్నారు. సీబీఐటీ ప్రిన్సిపాల్ సీ.వీ. నరసింహులు మాట్లాడుతూ.. దేశ సాంకేతిక పురోగతికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు మానవ ప్రయత్నం, నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ శాఖను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ పీవీఆర్ రవీంద్రారెడ్డి, ఏఈసీ డైరెక్టర్ డాక్టర్ సురేష్ పబ్బోజు, ఐఈఈఈ స్టూడెంట్ చాప్టర్ ఫ్యాకల్టీ సలహాదారుడు డాక్టర్ మల్లికార్జున్‌రావు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ రజినీ కాంత్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ న్యూ ఫ్రెండ్స్ కాలనీలో రూ.14.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. అత్తాపూర్ డివిజన్‌లో చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్లు సమ్మె చేస్తున్నారన్నారు. కాలనీలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు చాలా అధ్వాన్నంగా మారాయని కాలనీ ప్రజలు సూచించడంతో జీహెచ్ఎంసీ ఆయా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేశామన్నారు. బీజేపీ నాయకులు బిటుకూరి సిద్దేశ్వర్, సన్నీ, శ్రీపాల్‌రెడ్డి, ఎల్. వెంకటేష్, అనురాధ, ప్రభాకర్‌రెడ్డి, కాలనీ ప్రజలు తదితరులున్నారు.

'గండిపేట' నీటి విడుదల


సమాచారం ఇవ్వలేదని స్థానికుల మండిపాటు

మణికొండ: ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా గండిపేట నీటిని అప్రకటితంగా విడుదల చేశారు. గండిపేట చెరువు పూర్తిస్థాయి నీటి మట్టం 1790 అడుగులు కాగా.. అంతకు మించి నీరు వచ్చి చేరింది. దీంతో ఎక్కువగా అర అడుగు నీటితో పాటు మరో అడుగు మేర నీటిని విడుదల చేయాలని జలమండలి అధికారులు నిర్ణయించి గురువారం రాత్రి రెండు గేట్లను రెండు అడుగుల మేర నీటిని విడుదల చేశారు. శుక్రవారం ఉదయం మరో రెండు గేట్లను మరో రెండు అడుగులు ఎత్తారు. దీంతో 2వేల క్యూసెక్కుల నీరు మూసీనదిలోకి వదిలారు.

ఎలాంటి ప్రకటన చేయలేదు..

గండిపేట, నార్సింగి, మంచిరేవుల గ్రామాలలో మూసీనది పక్కనే ఉన్న వారు ఇబ్బందులు పడ్డామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నీటిని విడుదల చేశారన్నారు.

- పరివాహకంలో ప్రముఖుల ఫాంహౌస్‌లు మునిగినందునే వారి మెప్పు కోసమే నీటిని వృధాగా మూసీలోకి వదులుతున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నపలంగా ఆదేశాలు రావటంతోనే గేట్లను ఎత్తామని, శనివారం సాయంత్రం వరకు గేట్లు తెరిచే ఉంటాయని జలమండలి అధికారులు వివరణ ఇచ్చారు.



నిండుకుండలా చెరువు

ఆశావర్కర్ల రాస్తారోకో

మణికొండ: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో ఆశావర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం గండిపేట మండల ఆశావర్కర్లు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఆశావర్కర్లను క్రమబద్ధీకరిస్తానని, వారికి రూ.18వేల జీతాన్ని ఇస్తామని సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించారన్నారు. వాటిని ఇప్పటి వరకు అమలు చేయకపోవటంతోనే వారు సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్, రూ.10 లక్షల బీమా సౌకర్యాలను కల్పించాలన్నారు. ఆశా వర్కర్లు లత, శ్రీదేవి, శంకరమ్మ, రుక్మిణి, జ్యోతి, కవిత, ప్రశాంతి, విజయ పాల్గొన్నారు.



నార్సింగిలో రాస్తారోకో చేస్తున్న దృశ్యం